అమ్ముకునేందుకూ కష్టాలే!

కేంద్రాలు ప్రారంభించారు.. కొనుగోళ్లు మరిచారు

- సకాలంలో దిగుమతి కాక, పట్టాల కొరతతో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం
- కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు
- రోజుల తరబడి ధాన్యం రాశుల వద్దే నిరీక్షిస్తున్న రైతులు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని వేడుకోలు

చిట్యాల: ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకూ రైతులకు కష్టాలు తప్పడం లేదు. సకాలంలో ధాన్యం దిగుమతి కాక, కొన్ని కేంద్రాల్లో పట్టాల కొరతతో కొనుగోళ్ల కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చిట్యాల, వెలిమినేడు, గుండ్రాంపల్లి సింగిల్ విండోల ఆధ్వర్యంలో పక్షం రోజుల క్రితం మండలంలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు మందకొడిగా జరుగుతుండగా మరికొన్ని కేంద్రాల్లో ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదు.

ధాన్యం కొనుగోళ్లు ఇలా..

చిట్యాలలోని కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు పదివేల క్వింటాళ్లు, ఉరుమడ్లలో 1900 క్వింటాళ్లు, వట్టిమర్తిలో 700 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



వెలిమినేడులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

చేశారు. ఈ పీఏసీఎస్ పరిధిలో ఇంకా ఆరవై వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. గుండ్రాంపల్లిలో పదిహేను వందల క్వింటాళ్లు, సుంకెనపల్లిలో 1,512 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. మరో పదిహేను వేల క్వింటాళ్ల ధాన్యం ఇక్కడ కొనుగోలు చేయాల్సి ఉంది. వెలిమినేడులో 660క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 40వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది.

కొనుగోళ్లు జరగని కేంద్రాలివి..

మండలంలోని చిట్యాల సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించిన నేరడ, ఎలికట్టె కొనుగోలు కేంద్రాలు, వెలిమినేడు సింగిల్ విండో పరిధిలోని ఆరెగూడెం, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి, పిట్టంపల్లి, పేరేపల్లి, గుండ్రాంపల్లి సింగిల్ విండో పరిధిలోని ఏపూరు గ్రామంలోని ధాన్యం కేంద్రాలను ప్రారంభించినప్పటి నుంచి బస్తా ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. దీంతో ఆయా కేంద్రాలకు అమ్మకానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులు వారాల తరబడి ధాన్యం రాశుల వద్దే నిరీక్షిస్తున్నారు. ధాన్యం వర్షానికి తడవకుండా ఉండేందుకు పట్టాలను కిరాయికి తెచ్చుకుని వేలాది రూపాయలను కిరాయి కడుతున్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేస్తాం

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ లోడు లారీ ధాన్యం దిగుమతికి ఐదు రోజుల సమయం పడుతోంది. మరికొన్ని కేంద్రాల్లో పట్టాల కొరత కారణంగా ధాన్యం కొనుగోళ్లు జరపటం లేదు. సమస్యలను అధిగమించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తాం.

– చిట్యాల, వెలిమినేడు, గుండ్రాంపల్లి సింగిల్ విండోల సీఈఓలు బ్రహ్మాచారి, రాజిరెడ్డి, రాజమల్లు

వారం రోజుల క్రితం ధాన్యం తీసుకువచ్చా



వెలిమినేడు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి వారం రోజుల క్రితం ధాన్యం తీసుకువచ్చా. ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. వర్షానికి ధాన్యం తడవకుండా పట్టాలకు కిరాయికి తెచ్చి కాపాడుకుంటున్నా. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి. రైతులకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలి.

– బొంతల రామకృష్ణారెడ్డి, వెలిమినేడు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నకిరేకల్ మండలం నోముల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, నాయకులు సామ రవీందర్‌రెడ్డి, కుంచం సోమయ్య, కరుణాకర్‌రెడ్డి, నయీం తదితరులు పాల్గొన్నారు.



నోములలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రివర్ నిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వైద్యులు

నల్లగొండ టౌన్: వరల్డ్ స్ట్రోక్ డే (ప్రపంచ పక్షవాత దినోత్సవం) సందర్భంగా రివర్ నిమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ డాక్టర్ పుల్లారావు, బండారు ప్రసాద్ మాట్లాడుతూ స్ట్రోక్‌కు కారణాలు, లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించడానికి అక్టోబరు 29న ప్రపంచ స్ట్రోక్‌డే జరుపుతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, రాజేంద్ర, గౌతమ్, సుధారాణి, హర్షసూరి, యువచందన్, వీరారెడ్డి, దీపక్, చైతన్య, ప్రతీక్ పాండే షన్ సీఈవో గోనారెడ్డి, కట్ట అనంతరెడ్డి, అనిల్, దీప్తి పాల్గొన్నారు.

బీసీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

నల్లగొండ టౌన్: బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను నవంబర్ 4న జిల్లా కేంద్రానికి రానున్న బీసీ కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు కోరారు. మంగళవారం బీసీ భవన్‌లో జరిగిన అన్ని కుల సంఘాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని బీసీ కుల సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు పార్టీల కతీతంగా బీసీ కమిషన్ సభ్యులకు వినతిపత్రాలు అందజేయాలన్నారు. పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేయడానికి జీఓ విడుదల చేసిందని పేర్కొన్నారు. సమావేశంలో నేలపట్ల సత్యనారాయణ, కాసోజు విశ్వనాథం, కంది సూర్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, కేశబోయిన శంకర్, చిక్కుల్ల రాములు, పొట్టబత్తుల సత్యనారాయణ, సీతారాములు, వెంకటేశ్వర్లు, ఎల్లంరాజు, రమేష్, భజరంగ్‌ప్రసాద్, యాదగిరి, ఈత ముదిరాజ్, గోవర్ధన్, శ్రీధర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండటౌన్: అమెరికా సామ్రాజ్యవాద నిరంకుశ నిర్బంధ విధానాలను ఖండిస్తూ క్యూబాకు అండగా నిలవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద క్యూబాకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద పెత్తనం మూలంగా క్యూబా ఇబ్బందులు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సలీం, సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, అద్దంకి నర్సింహ, సైదాచారి, సత్యనారాయణ, కత్తుల యాదయ్య, కోట్ల అశోక్‌రెడ్డి, అశోక్, యాదయ్య, వెంకన్న, శంకర్, రవీందర్, గిరి, సైదులు, యాదయ్య, సర్వయ్య పాల్గొన్నారు.

నవంబర్ 4న మాదిగల ధర్మయుద్ధ సదస్సు

మర్రిగూడ: నల్లగొండ జిల్లా కేంద్రంలో నవంబర్ 4న మాదిగల ధర్మ యుద్ధ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా తిరుమలేష్‌మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అమలుల్లోకి తీసుకురాకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి నల్లగంటి రమేష్, నాయకులు కూరుపాటి శంకర్, ఆకారపు ఏసు, మైలారపు రాజు, భూసిపాక నరేష్, జోగి యాదయ్య, పాల్వాయి బన్ని, లపంగి మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బకరం శ్రీనివాస్ మాదిగ

నవంబర్ 12 నుంచి నిరవధిక సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.డి. సలీం

నల్లగొండ టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 12నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి. సలీం తెలిపారు. మంగళవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్మికులకు రావాల్సిన పెండింగ్ ఏరియర్స్‌ను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దండంపల్లి సత్తయ్య, గుండమల్ల శ్రీనివాస్, పెరిక కృష్ణ, పేర్ల సంజీవ, దాసరి లక్ష్మమ్మ, కత్తుల కృష్ణవేణి, ఈశ్వరమ్మ, ఎల్లమ్మ, సుజాత, పద్మ, వెంకటేశం, లింగయ్య, అంజమ్మ, సత్తయ్య, శ్రీదేవి, నర్సింహ పాల్గొన్నారు.

రేపు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

నల్లగొండ టౌన్: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల సందర్భంగా కార్మిక అడ్డాల వద్ద జెండావిష్కరణలు, సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి. సయిద్, దొనకొండ వెంకటేశ్వర్లు, రాజు, దోమల శ్రీను, రేవెల్లి యాదయ్య, మల్లయ్య, నర్సింహ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై దేశవ్యాప్త ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నకిరేకల్ : రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.కేంద్రంలో మోది ఆర్థిక విధానాల వలన డీజిల్, పెట్రోల్, నిత్యావసర సరుకుల ధరలకు పెరుగుతున్నాయన్నారు. ధరల పెరుగుదలపై వచ్చే నెల 7నుంచి 15 వరకు సీపీఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టబోయే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఆ పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు కందాల ప్రమీలా, సాకుంట్ల నర్సింహ, బహురోజు ఇందిరా, వంటెపాక కృష్ణ,నాగమణి, గింజల లక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల పిల్లలు పాఠశాలలో చేరిక

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలోని హనుమాన్ రైస్ ఇండస్ట్రీలో వానాకాలం సీజన్‌లో పని చేసేందుకు వచ్చిన బిహార్‌కు చెందిన వలస కార్మికుల పిల్లలను సోమవారం ఆ రైస్ మిల్ యజమాని, రైస్‌మిల్లర్స్ అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతు మంగళవారం చిట్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఆ పిల్లలకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, ప్లేట్స్, పెన్నులను అందించాడు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం అంబటి సత్తయ్య, ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, యానాల సరిత, కంచరకుంట్ల సుధాకర్‌రెడ్డి, శారద, వెంకటేశ్వర్లు, పుష్పలత పాల్గొన్నారు.



పాఠశాలలో చేరిన పిల్లలతో ఉపాధ్యాయులు, రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు హనుమంతు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పరిశీలన

నకిరేకల్ : పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్ సూచించారు. ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా నకిరేకల్‌లోని వివిధ ప్రాంతాల్లో పొదుపు సంఘాల సభ్యులు చేపట్టిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంగళవారం ఆయన పరిశీలించారు.మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ బాలయ్య, డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ శివాజీ, మెప్మా ఏడీఎం పద్మ ఉన్నారు.



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

రామగిరి(నల్లగొండ): చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి సౌందర్య బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన పజ్జూరి స్వామిగౌడ్ వద్ద తంగెళ్ల మల్లికార్జున్‌రెడ్డి 2015లో రూ.2.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. జమానత్‌గా ఇచ్చిన చెక్కును బ్యాంకులో సమర్పించడంతో అకౌంట్ లేదు అని చెప్పారు. చెల్లని చెక్కు ఇచ్చినందుకు మల్లికార్జున్‌రెడ్డికి 6 నెలల జైలు శిక్ష, రూ. 2.5 లక్షలు చెల్లించాలని జడ్జి తీర్పు ఇచ్చారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

కేతేపల్లి: నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తప్పక గుర్తింపు లభిస్తుందని కేతేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు యానాల నర్సిరెడ్డి అన్నారు.కేతేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న కె.లాజరస్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం ఆ పాఠశాలలో నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన లాజరస్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుశీల, ఎంఐఎస్ మండల కోఆర్డినేటర్ సైదులు, సీఆర్పీ మల్లయ్య పాల్గొన్నారు.



లాజరస్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

తిప్పర్తి : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రాజుపేట ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు నూనే వెంకటేశ్వర్లును ఉపాధ్యాయ బృందంతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మేకల జాన్‌రెడ్డి, సుంకరి భిక్షంగౌడ్, మహేందర్‌రెడ్డి, హెచ్‌ఎం సుశీల, నలప రాజు యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్ త్రిపాఠీకి క్లాత్ బ్యాగ్ అందజేత

నల్లగొండ టౌన్: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పెండెం కృష్ణకుమార్ కోరారు. ఆయన మంగళవారం నల్లగొండ నూతన కలెక్టర్ ఇలా త్రిపాఠీని మర్యాద పూర్వకంగా కలిసి చేతి సంచిని అందజేశారు. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని కోరారు. కృష్ణకుమార్ నాలుగు సార్లు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు.

నూతన కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న వెంకన్న

నల్లగొండ టూటౌన్: నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇలా త్రిపాఠీని పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి జగిని వెంకన్న బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. కలెక్టర్‌కు ఆమె చిత్రపటాన్ని బహూకరించి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆయుర్వేద దినోత్సవం

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులచే గర్భిణులు, కిశోరబాలికలు, చిన్నారులకు ఆయుర్వేద పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్యకుమారి, సూపర్‌వైజర్ సునిత తదితరులున్నారు.

స్వయం ఉపాధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టూటౌన్: స్వయం ఉపాధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ సూచించారు. నల్లగొండ పట్టనంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్, కంప్యూటర్, ఎంబ్రాయిడరీ యూనిట్లను మంగళవాం వారు సందర్శించి మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తినుబండరాలు, పచ్చళ్లు, పిండి వంటలు చేసి దేశ విదేశాలకు కూడా పంపి లాభాలు ఆర్జించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మెప్మాసిబ్బంది శివాజీ, శ్రీనివాస్, నర్సింహ, జ్యోతి, అనిల్, రాజు పాల్గొన్నారు.



నల్లగొండలో పచ్చళ్ల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్

సదర్‌ను గుర్తించడం హర్షణీయం



నల్లగొండ : పాలాభిషేకం చేస్తున్న యాదవ సంఘం నాయకులు

నల్లగొండ: యాదవుల సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ యాదవ సంఘం నాయకులు మంగళవారం నల్లగొండలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సదర్ ఉత్సవాన్ని ప్రభుత్వం గుర్తించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లి సుభాష్ యాదవ్, కన్నబోయిన సైదులు యాదవ్, చిన్నాల జానయ్య యాదవ్,అల్లి వేణు యాదవ్, మేకల యాదయ్య యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్, బెల్లి నాగరాజు యాదవ్, క్రాంతి యాదవ్, లక్ష్మణ్ యాదవ్, గుండబోయిన వెంకన్న యాదవ్, శివ యాదవ్, కదారి కోటి, పవన్, వెంకన్న పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నార్కట్‌పల్లి: సదర్ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ యాదవ సంఘం నాయకులు మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కన్నెబోయిన సైదులు, దూదిమెట్ల సత్తయ్య, బింగి కొండయ్య, కొమరబోయిన మల్లేశం, దొండ రమేష్, దూదిమెట్ల వెంకన్న, కమ్మలపల్లి మల్లేశం, మట్టిపల్లి శ్రీను, పర్రెపాటి లింగస్వామి, తోడుసూరి నర్సింహ, మహేష్, రాంబాబు, మర్రి లింగస్వామి, నగేష్, దుబ్బాక నరేష్, బొబ్బిలి లింగయ్య, సత్తయ్య, గోపాల్ ఉన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 23 మంది పేదలకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేసిన రూ.7.18 లక్షల విలువైన చెక్కులను మంగళవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు.

మంత్రి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

నల్లగొండ: నల్లగొండలోని 11వ వార్డుకు చెందిన మొహ్మద్ సోహెల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమకూర్చిన రూ.50వేలను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో సోహెల్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి శంకర్, దాసరి విజయ్,దండెంపెల్లి పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు పాలకూరి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ గ్రామ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.21,200లను మంగళవారం మృతుడు మల్లయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ గౌడ సంక్షేమ సంఘం సభ్యులు ఉయ్యాల నాగరాజు గౌడ్, ఉయ్యాల పెద్ద వెంకటయ్యగౌడ్, ఉయ్యాల లింగస్వామిగౌడ్, సుంకరి శేఖర్‌గౌడ్, ఉయ్యాల లింగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

నేత్ర దానానికి ముందుకు రావాలి

నల్లగొండ టౌన్: మరణానంతరం నేత్రదానం చేయడానికి వారి కుటుంబ సభ్యులు ముందుకు రావాలని ప్రముఖ నేత్ర వైద్యుడు ఏసీహెచ్. పుల్లారావు, ఆర్థోపెడిక్ సర్జన్ డా.హరినాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణా నికి చెందిన పందిరి మధు మరణించడంతో వారి కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. దీంతో పుల్లారావు ఆధ్వర్యంలో కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో చిరునోముల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ క్రాంతికుమార్, వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతి కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీవీఆర్ చేతన స్కూల్ వ్యవస్థాపకులు పుచ్చకాయల వెంకట్‌రెడ్డి సమకూర్చిన నిత్యావసర సరుకులను ఎస్‌ఐ క్రాంతికుమార్ చేతుల మీదుగా పంచాయతీ సిబ్బందికి పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు, హెచ్‌సీ రమేష్, పంచాయతీ కార్యదర్శి శుభానొద్దీన్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

చిట్యాల: చిట్యాల కాంప్లెక్స్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం, వెంకటాపురం, వనిపాకల గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, సాయి ద్వారకపురి కాలనీలోని ఉర్దూ మీడియం పాఠశాలను మంగళవారం కాంప్లెక్స్ హెచ్‌ఎం గోగికార్ మాధవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కౌసల్య, అరుణకుమారి, సతీష్, జుబీన్‌సుల్తానా, సీఆర్‌పీ ప్రవళ్లిక పాల్గొన్నారు.

కృత్రిమ కాలు అందజేత



కృత్రిమ కాలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన షేక్ యాకూబ్‌అలీ డయాబెటిక్ సమస్యతో ఎడమకాలు కోల్పోయాడు. నకిరేకల్ లయన్స్‌క్లబ్ ప్రతినిధి రావిరాల అశోక్ ద్వారా యాకూబ్‌అలీ కుటుంబ నేపథ్యం తెలుసుకున్న ఆ క్లబ్ ప్రతినిధులు విషయాన్ని లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ చారిటబుల్ ట్రస్టు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం హైదరాబాద్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో బాధితుడికి కృత్రిమకాలు అందజేశారు.